# బాలమిత్ర

**- వాసంతి మాఘపు.**

**పద్యము:** **ఎండిన మా నొకటడవిని**
**నుండిననందగ్ని పుట్టి యూడ్చును చెట్లన్**
**దండిగల వంశమెల్లను**
**చండాలుండొకడు పుట్టి చదువును వేమా!**

ఊడ్చును = దహించును;

**అర్థం:** అడవిలో ఎండిన చెట్టు ఒక్కటి ఉన్నా చాలు. దానిలో పుట్టిన అగ్నివలన ఆ అరణ్యం అంతా దహించుకుపోతుంది. అలాగే ఎంతటి కీర్తి ప్రతిష్టలు గల వంశములోనైనా ఒక్క దుర్మార్గుడు జన్మిస్తే చాలు. వాడి దుర్గుణాల కారణంగా ఆ వంశం పేరు ప్రతిష్ఠలు మంటగలసిపోతాయి.

**పద్యము:** ***కలుష మానసులకు గాన్పింపగారాదు***
***అడుసులోన భాను డడగినట్లు***
***తేటనీరు పుణ్యదేహమట్లుండురా***
***విశ్వదాభిరామ! వినురవేమ!***

కలుష మానసులు = చెడు ఆలోచనలు చేయువారు;

అడుసు = బురద;

**అర్థం:** బురదలో సూర్యుని ప్రతిబింబము ఎలా కనబడదో, అలాగే చెడు ఆలోచనలు చేయువారికి జ్ఞానం కనిపించదు. నిర్మలమైన నీటిలో సూర్యుని ప్రతిబింబము ఎలా ప్రకాశవంతముగా కనిపిస్తుందో అలాగే పరిశుద్ధమైన మనస్సుగల వారికి మాత్రమే జ్ఞానము గోచరిస్తుంది.

* * *

**పద్యము:** **ఆచార్యున కెదిరింపకు**
**బోచిన దొర నిందసేయ(బోకుము కార్యా**
**లోచనము లొంటి(జేయకు**
**మాచారము విడువ(బోకుమయ్య కుమారా!**

**అర్థం:** ఉపాధ్యాయుని ఎదిరింపవలదు. నిన్ను కాపాడిన వారిని నిందించరాదు. ఏదైనా ముఖ్యమైన ఆలోచన ఒంటరిగా చేయవలదు. మంచి నడవడికని వదలిపెట్టవద్దు..

## పదమేంటో చెప్పుకోండి!

క్రింద ఇచ్చిన ఆధారములనుపయోగించి పదమేంటో చెప్పుకోండి!

1. ఇది 5 అక్షరముల ఊరి పేరు.
2. మొదటి మూడు అక్షరముల తరువాత 'ము' చేరిస్తే, సూర్యుడు తూర్పు కొండలలో ప్రత్యక్షమైనది మొదలు, నడినెత్తికి వచ్చే వరకు సమయము.
3. చివరి రెండు అక్షరములు 'కొండ' అనే అర్థమును తెలియజేస్తాయి.
4. రెండు, మూడు అక్షరములు కృప అనే అర్థాన్నిస్తాయి.
5. ఒకటి, ఐదు అక్షరములు కలిస్తే ఒక రకమైన మరణదండన.

**ఏమిటా పదము?**

(సమాధానములు వచ్చే సంచికలో)

గత సంచికలోని **'పదమేంటో చెప్పుకోండి!'**
**రామచంద్రాపురం.**

**సామెతలు:** గుడ్డు వచ్చి పిల్లను వెక్కిరించినట్టు.
హనుమంతుని ముందు కుప్పిగెంతులు.

**పొడుపు కథలు:**

మూడే అడుగులుంటాను.
వామనమూర్తిని కాదు.
నాకు, ఏనుగుకు సామ్యముంది.
కాని జంతువును కాదు.
నీవు దేవుని కొలిస్తే, నేను పాడవును కొలుస్తాను.
నేనెవరిని? ( [illegible] )

*తప్పు- ఒప్పు: బాష అని వ్రాయడం తప్పు. భాష అని వ్రాయడం ఒప్పు.*

# భగవద్గీత

*(శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజజీయరు స్వామిగారి మంగళాశాసనములతో)*

ఒక తండ్రి "భగవద్గీత మా పిల్లలకు అర్థం అవ్వడం లేదు, వాళ్ళు ఏమి చేస్తున్నా కొంతకాలానికి మళ్ళీ మరచిపోతున్నారు, వాళ్ళు భగవద్గీత చదవడం వల్ల లాభమేమిట"ని ఒక స్వామీజీని ప్రశ్నించాడు. స్వామీజీ ఒకసారి అతని కళ్ళలోకి చూసి, చిరు దరహాసంతో ఒక కథ చెప్పారు.

ఒక వృద్ధుడైన రైతు, అతని మనుమడు వ్యవసాయం చేసుకుంటూ కాలం గడుపుతున్నారు. ఒకసారి మనుమడు "తాతా! నేను నీలాగే భగవద్గీత చదవాలని ప్రయత్నిస్తున్నాను. నాకు ఏమీ అర్థమవ్వడం లేదు. అర్థమైన కొంచెం కూడా పుస్తకము మూసివెయ్యగానే మరచిపోతున్నాను. ఇక భగవద్గీత చదవడం వల్ల ప్రయోజనమేమిటి?" అని ప్రశ్నించాడు.

కుంపటిలో బొగ్గులు వేయబోతున్న ఆ రైతు ఒక్క క్షణం ఆగి, "ఈ బుట్ట తీసికొని పోయి, ఆ నదిలో నీటిని తీసికొనిరా!" అని మనుమడిని ఆజ్ఞాపించాడు.

మారుమాట్లాడకుండా ఆ మనుమడు తాతచెప్పినట్లే నీళ్ళను ఆ బుట్టలోనికి పట్టి తీసికొనివచ్చాడు. కాని తాతవద్దకు చేరుకునేసరికి ఆ బుట్టలోని నీరు చాలావరకు కారిపోయింది. తాత నీళ్ళు తెమ్మని మళ్ళీ మళ్ళీ పంపిచాడు. ప్రతిసారీ అతని వద్దకు వచ్చేసరికి నీరంతా కారిపోయేది.

మనుమడు ఆయాసపడుతూ "తాతా! ఇది వృధాప్రయాస." అన్నాడు.

"ఇది అంతా వృధా అనే అనుకుంటున్నావా?" తిరిగి ప్రశ్నించాడు తాత. "ఒక్కసారి ఆ బుట్టను చూడు." అన్నాడు మళ్ళీ అతనే.

మనుమడు తెరిపార ఆ బుట్టను చూసాడు. ఆ బుట్ట ఇది వరకు ఉన్నట్లు నల్లగా, బొగ్గుపొడి వలన మలినమైన బుట్టలా లేదు. బయట, లోపలా కూడా శుభ్రముగా తళతళలాడుతూ ఉంది.

అపుడు తాత నెమ్మదిగా "చూసావా! భగవద్గీత చదవడము వలన కూడా ఇలాగే జరుగుతుంది. నీకు అర్థము కాకపోవచ్చు. నీకు అంతా గుర్తులేకపోవచ్చు కూడా. కాని అది చదివినప్పుడు నీలో పరివర్తన (మార్పు) తప్పకుండా వస్తుంది. అదే భగవంతుడైన శ్రీకృష్ణుడు మనపై చూపే దయ, ప్రేమ." అని చెప్పాడు.
మనుమడు తనకు విషయమును చక్కగా బోధపరచినందుకు తాతకు వినయపూర్వకముగా కృతజ్ఞతను తెలియజేసాడు.

***దీనివలన నేర్చుకున్న నీతి ఏమిటి?***

*మన పెద్దలు మనకు అందజేసిన ఎన్నో సంప్రదాయములలో నిగూఢముగా ఎన్నో విలువలున్నాయి. ఎంతో విజ్ఞానముంది. ఒక పద్ధతిని ఆచరించడమువలన మనకు కలిగే లాభమేమిటో కొన్ని సందర్భములలో మనకు అర్థముకాదు. అయినా కూడా పాటించడమువలన ఎన్నో లాభములు కలుగుతాయి. ఏదో ఒక సందర్భములో మనము ఆచరించిన వాటి ఫలితము మనకు అవగతమవుతుంది. కావున ఆచరణ ద్వారా మరియు సహనము ద్వారా నిత్యానందమును పొందడము సాధ్యమవుతుంది.*

*